# ప్రత్యేక తనిఖీల్లో 152 కాంట్రాక్టు క్యారేజ్ బస్సులపై కేసు నమోదు,
# రూ.5,01,500 అపరాధ రుసుము

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: రాష్ట్ర రవాణా కమిషనరు ఆదేశాల మేర కాంట్రాక్టు క్యారేజ్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా గురువారం, శుక్రవారం తెల్లవారుజాము వరకు కలపర్రు టోల్గేట్ వద్ద వాహన తనిఖీ అధికారులు కాంట్రాక్టు క్యారేజ్ బస్సులపై నిర్వహించారు. ప్రత్యేక తనిఖీల్లో 152 కేసులు నమోదు చేసి రూ.5,01,500 అపరాధ రుసుము,పన్ను విధించినట్లు డిటిసి షేక్ కరీమ్ తెలిపారు. ఏలూరు జిల్లాలోని వాహన తనిఖీ అధికారులను బృందాలుగా ఏర్పాటు చేసి కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. విశాఖపట్నం నుంచి విజయవాడ మరియు విజయవాడ నుంచి విశాఖపట్నం మధ్య తిరిగే కాంట్రాక్టు క్యారేజ్ బస్సులను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి పర్మిట్ నిబంధనలను ఉల్లంఘించిన బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్టీవోలు కె.ఎస్.ఎం.ఎన్.కృష్ణారావు ఎండి. మదని, వాహన తనిఖీ



అధికారులు ఎస్.రంగనాయకులు, జి.ప్రసాద రావు, జి.స్వామి, వై.సురేష్ బాబు, కళ్యాణి, కృష్ణవేణి, పి.నరేంద్ర బాబు, అన్నపూర్ణ, డి.ప్రజ్ఞ పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులతో యువకుని ఆత్మహత్య



జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త: జంగారెడ్డిగూడెంలో ఓ కుటుంబం ఆత్మహత్య యత్నానికి పాల్పడిన ఘటనలో ఆ కుటుంబ యజమాని శుక్రవారం మరణించినట్లు జంగారెడ్డిగూడెం డి ఎస్ పి యు.రవి చంద్ర మీడియాకు తెలిపారు. పట్టణానికి చెందిన మంగిన సత్య దుర్గా చంద్రరావు (చంద్రం) భార్య కృష్ణ జ్యోతి,కుమారుడు దుర్గా చరణ్,కుమార్తె కోమలి గురువారం కూల్ డ్రింక్ తో కలుపుమందు త్రాగారు. దీనిని గమనించిన చుట్టు పక్కలవారు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వీరిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు జనరల్ ఆసుపత్రికి తరలించారు.ఆర్థిక ఇబ్బందులు,అప్పులు కారణంగా ఈ కుటుంబం ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించినట్లు ప్రాథమిక సమాచారం. ఇదే విషయన్ని డి ఎస్పీ రవిచంద్ర మీడియా దృష్టికి తీసుకురాగా ఆయన మాట్లాడుతూ ఈ సంఘటనలో మంగిన చంద్రం గుంటూరు ఆస్పత్రిలో మరణించారని మిగిలిన కుటుంబ సభ్యులకు వైద్యం జరుగుతుందని తెలిపారు ఆర్థిక ఇబ్బందుల వలన మరణించినట్లుగా ప్రాథమిక సమాచారం బట్టి తెలుస్తోందని పూర్తి దర్యాప్తు అనంతరం వివరాలు వెలువడతాయని తెలిపారు.

# తొలకరి వచ్చింది భూమి పండగ తెచ్చింది

వేలేరుపాడు,మే 30, ప్రభాత వార్త : తొలకరి వచ్చింది భూమి పండగ తెచ్చింది ఇక వేలేరుపాడు మండలం అంతా సందడి వాతావరణం మొదలైంది. తొలకరి జల్లులు పడటంతో వేలేరుపాడు మండలంలోని అన్ని గ్రామాలలో భూమి పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి. పంటలు బాగా పండాలని ధాన్య రాశులు ఇంట్లో కొలువై ఉండాలని కోరుకుంటూ, ఆదివాసి బిడ్డలు సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా భూమి పూజ వేడుకలను నిర్వహిస్తారు. మహిళలు కర్రలను తాడులను అడ్డుపెడుతూ వాహనాలను ఆపుతూ సంప్రదాయ నృత్యాలు చేస్తూ పాటలు పాడుతూ విరాళాలను సేకరిస్తారు.మగవారంతా వేటకు వెళుతూ భూమి పూజకు అంతా సిద్ధం చేస్తారు.ఏజెన్సీలో పండగ వాతావరణం అంతా ఈ భూమి పూజతోనే మొదలవుతుంది. వారం రోజులు పాటు విరాళాలను సేకరించిన తదుపరి ఒక మంచి రోజు చూసుకొని భూమి పూజను నిర్వహిస్తారు, ఆ తర్వాత మాత్రమే వ్యవసాయ కార్యక్రమాలు



మొదలుపెడతారు. వేలేరుపాడు మండలంలో శుక్రవారం వారాంతపు సంత కావడంతో ఆదివాసి మహిళలు పెద్ద ఎత్తున వాహనాలను ఆపుతూ విరాళాలను సేకరిస్తూ సందడి వాతావరణాన్ని కనబరిచారు.ఆదివాసీలకు సంప్రదాయంగా వస్తున్న భూమి పూజను తరాలు మారుతున్న ఇప్పటికీ కొనసాగిస్తూ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా సమాజానికి ఈ తరం ఆదివాసీలు తెలియపరుస్తున్నందుకు ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు.

# హాస్టళ్ల లోమలాథియాన్ ఫోకల్ రెసిడ్యూవల్ స్ప్రేయింగ్ .

అత్తిలి - మే 30 ( ప్రభాత వార్త ): పెనుగొండ, పెనుమంట్ర,అత్తిలి : మండలాల్లో ఉన్న22 హాస్టల్స్ లో మలాథీయాన్ 25 శాతం తో ఫోకల్ రెసిడ్యూవల్ స్ప్రేయింగ్ చేయించినట్లు సబ్ యూనిట్ ఆఫీసర్ జి. వెంకటేశ్వరరావు తెలిపారు.కీటక జనిత వ్యాధుల నివారణలో భాగంగాను ముందస్తు జాగ్రత్తలల్లో భాగంగాను ఉన్నతాధికారుల సూచనల మేరకు ఈ స్ప్రేయింగ్ చేయించినట్లు తెలిపారు. ,హాస్టల్స్ పరిశుభ్రత విషయంలో హాస్టల్ సిబ్బందికి పలు మార్గదర్శక సూచనలు ఇచ్చారు. ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్వైజర్ కె. సత్యన్నారాయణ,ఆయా హాస్టల్స్ పరిధిలోని గ్రామ ఆరోగ్య కార్యదర్శులు,ఆశా కార్యకర్తలు,హాస్టల్స్ సిబ్బంది పాల్గొన్నారు.



# లాభసాటి సాగు కోసమే వికసిత కిసాన్ సంకల్ప అభియాన్ లక్ష్యం
## - ఎమ్మెల్యే పితాని


ఆచంట, మే-30, ప్రభాతవార్త: రైతుకు లాభసాటి వ్యవసాయం అందించాలనే ఉద్దేశంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వికసిత కిసాన్ సంకల్ప అభియాన్ కార్యక్రమం చేపట్టిందని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. మండలం లోని కొడమంచిలి రైతు భవనంలో వికసిత కిసాన్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1.5 కోట్ల మంది రైతులకు 700 జిల్లాలలో 2 వేల బృందాలు అవగాహన చేసేందుకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతుకు నికర ఆదాయం వచ్చేలా వరి వంగడాలను సాగు చేసి చీడపీడల నివారణకు రైతుల శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులు సలహాలతో ముందుకు వెళ్లాలని రైతులను సూచించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని సాగు చేయడం వల్ల ఖర్చు తగ్గించుకోవచ్చునని అన్నారు. విత్తనాలు విత్తడం దగ్గర నుండి వ్యవసాయ యాంత్రీకరణతో గణనీయంగా ఖర్చులు తగ్గుతాయన్నారు. విదేశాల్లో బ్యాన్ చేసిన రసాయనాలు భారతదేశంలో వినియోగించడం జరుగుతుందని వీటిని అరికట్టవలసిన బాధ్యత రైతులపై ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు పండించిన పంటకు ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే సొమ్ము జమ చేయడం జరిగిందని అన్నారు. భవిష్యత్తులో వాట్సాప్ గ్రూపులను క్రియేట్



చేసి రైతులకు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలు సలహాలు అందించాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రాలు సక్రమంగా ఫిర్యాదులు అందుతున్నాయని నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ,ఉండి అధిపతి డా. ఎన్. మల్లికార్జునరావు, నిక్రా ప్రధాన శాస్త్రవేత్త డా. వై. సుబ్బయ్య, మార్టేరు ఏడిఆర్ రార్స్ డా. పి. సహదేవరెడ్డి, జడ్పిటీసి ఉప్పలపాటి సురేష్ బాబు, టిడిపి మండల అధ్యక్షులు కేత మీరయ్య, వైస్ ఎంపీపీ నాగరాజు, పాలకొల్లు ఏడీఏ అడ్డాల పార్వతి, ఉద్యానవనాధికారిణి ఎన్.ప్రియ దర్శిని, మండల వ్యవసాయాధికారి బి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి సేవలో కోనసీమ జిల్లా డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్

పాలకొల్లు, మే-30, ప్రభాతవార్త: పాలకొల్లు శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారిని కోనసీమ జిల్లా డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్ ఏవివి సత్యనారాయణ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షీరా రామలింగేశ్వర స్వామిని దర్శించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. వీరికి ఆలయ కార్యనిర్వాహణాధికారి ముచర్ల శ్రీనివాస్ శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయ అర్చకులు అనిల్ ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్ కృష్ణమోహన్, ఆడిటర్ సోమేశ్వరరావు, ఆలయ సూపరింటెండెంట్ పి వాసు పాల్గొన్నారు.



# కిషోరి వికాసంలో ఆర్థిక అంశాలపై అవగాహన కార్యక్రమం

పోడూరు, మే-30, ప్రభాతవార్త: మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల వద్ద కిషోరి వికాసంపై ఆర్థిక అంశాలు, పొదుపు పద్ధతులపై బాలికలకు అవగాహన కల్పించడం జరిగిందని ఐసిడిఎస్ సూపర్వైజర్లు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా అక్షరాస్యత అంటే డబ్బును నిర్వహించడం, బడ్జెట్, పెట్టుబడి నిర్వహించడం కూడా అన్నారు. మహిళలు, బాలికలు ఆర్థిక నైపుణ్యాలను కలిగి ఉండాలన్నారు. నగదు యొక్క విలువ, అవసరాలు కోరికల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.కెలు, ఏఎన్ఎం లు, అంగన్వాడీ టీచర్స్, వివోలు ఆశలు పాల్గొన్నారు.



# సూపర్ స్టార్ కృష్ణ సూపర్ అవార్డ్స్ ఎంపికైన రాయప్రోలు



భీమవరం మే 30 ప్రభాతవార్త : భీమవరంకు చెందిన సూపర్ స్టార్ కృష్ణ సీనియర్ అభిమాని రాయప్రోలు శ్రీనివాస మూర్తి సూపర్ స్టార్ కృష్ణ సూపర్ అవార్డ్స్ ఎంపికయ్యారు. ఈనెల 31న కృష్ణ జయంతి సందర్భంగా హైదరాబాద్ లో ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, తెలుగు సినిమా వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ స్టార్ కృష్ణ సూపర్ అవార్డ్స్ లో ఈ అవార్డును అందుకోనున్నారు. శుక్రవారం భీమవరంలోని కృష్ణ క్యాంస విగ్రహం వద్ద శ్రీనివాస మూర్తిని కృష్ణ, మహేష్ బాబు, శోభన్ బాబు అభిమానులు సత్కరించారు. కార్యక్రమంలో రాయప్రోలు భగవాన్, బిహెచ్ సుబ్బరాజు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, పెన్నాడ శ్రీను, పేరిచర్ల లక్ష్మణ వర్మ, కాట్రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రేపటినుండి రేషన్ షాప్ వద్ద సరుకులు



చాట్రాయి, మే 30, ప్రభాతవార్త : గతంలో వాహనాలపై ఇంటింటికి రేషన్ సరుకులు సరఫరా చేసే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందని జూన్ ఒకటవ తేదీ నుండి రేషన్ షాపుల కి వెళ్లి సరుకులు తెచ్చుకోవాలని తహసిల్దార్ ఈశ్వర్ చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మరియు సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి 8 గంటల వరకు రేషన్ డీలర్లు సరుకులు పంపిణీ చేస్తారని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కుటుంబంలో 65 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటి వద్దకే వచ్చి రేషన్ అందిస్తారని ఆయన చెప్పారు. రేషన్ సరుకులు అందే విధానంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని అక్రమ రేషన్ బియ్యం రవాణా కు అడ్డుకట్ట వేసి ప్రజలందరికీ రేషన్ అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఈ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది అని చెప్పారు. ఇప్పటికే మండలంలో అన్ని రేషన్ షాపుల్లో తనిఖీలు నిర్వహించి స్టాకు నిర్ధారణ చేసినట్లు ఆయన చెప్పారు.

# తెలుగు సినిమా పరిశ్రమలో లెజెండ్ దాసరి



భీమవరం మే 30 ప్రభాతవార్త : దర్శకరత్న దాసరి నారాయణరావు తెలుగు సినిమా పరిశ్రమలో లెజెండ్స్ గా చెప్పుకోదగ్గ అతికొద్ది మంది ప్రముఖుల్లో ఒకరని పలువురు కళాకారులు అన్నారు. భీమవరం వెంకట్రామ థియేటర్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం పట్టణ కళాకారుల అద్వర్యంలో దర్శకరత్న దాసరి నారాయణరావు 8వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. దాసరి వీరాభిమాని అడపా బాబ్జి, ప్రజానాట్య మండలి సభ్యులు ఎస్ కె చాన్ భాషా, కళా రంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది దాశరధి శ్రీనివాస్ మాట్లాడుతూ దర్శకుడిగా తెలుగు సినిమా రంగంలో తనదైన ముద్ర వేయడమే కాకుండా నటుడిగా, నిర్మాతగా గొప్ప గుర్తింపు తెచ్చుకున్న బహుముఖ ప్రతిభాశాలి దాసరి అని అన్నారు. అత్యధిక సినిమాలకు దర్శకుడిగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో కూడా స్థానం సంపాదించుకున్న వ్యక్తి దాసరి నారాయణరావు అని, తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఆయన ఒక శక్తిగా వెలుగొందారని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, చైతన్య భారతి నాటక పరిషత్ సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ 150కి పైగా సినిమాలకు దర్శకత్వం, 53 సినిమాలకు నిర్మాత, 250కి పైగా సినిమాలకు సంభాషణల రచయిత ఇలా ఎన్నో సినిమాల్లో నటుడిగా దాసరి తనదైన ముద్ర వేసుకున్నారని అన్నారు.

# యోగా శిక్షకులకు శిక్షణ .



అత్తిలి - మే 30 ( ప్రభాత వార్త ):అత్తిలి మండలం అత్తిలి , బల్లిపాడు , ఆరవల్లి గ్రామాలలో యోగాంధ్ర లో భాగంగా శిక్షకులకు శిక్షణ ఇచ్చినట్లు ఎంపిడిఓ పి శ్యామ్యూల్ తెలిపారు. జునె21 న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమం లో భాగంగా శిక్షకులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

# 25 మంది దివ్యాంగులకు దుప్పట్లు పంపిణి

భీమవరం మే 30 ప్రభాతవార్త : సమాజసేవ కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం ప్రతిఒక్కరి నైతిక బాధ్యత అని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే అంజిబాబు పుట్టినరోజు సందర్భంగా భీమవరం అల్లూరి శ్రీరామరాజు కళ్యాణ మండలంలో 25 మంది దివ్యాంగులకు నూతన వస్త్రాలు, దుప్పట్లను శ్రీవిజ్ఞానవేదిక ఎమ్మెల్యే అంజిబాబు అందించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ తోటివారికి సహాయం చేయడం స్ఫూర్తిదాయకమైన కార్యక్రమమని, దాతలు అందిస్తున్న సహకారాలు అద్వితీయమని అన్నారు.

# జనసేన ప్రజా సమస్యల పరిష్కార వేదిక
## - పాల్గొన్న ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం ప్రభాతవార్త నరసాపురం పట్టణ జనసేన పార్టీ కార్యాలయంలో "గ్రీవెన్స్ సెల్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక" శుక్రవారం ప్రారంభించబడింది. ఈ వేదిక ద్వారా ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా వినడం, వాటికి పరిష్కార మార్గాలను సూచించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ , నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంఛార్జ్ పొత్తూరి రామరాజు కలిసి హాజరై ప్రజల నుండి వచ్చిన వ్యక్తిగత, సామూహిక సమస్యలు, అభ్యర్థనలు మరియు విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రథమ ప్రాధాన్యత అని, అన్ని అంశాలపై సంబంధిత శాఖలతో సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సహకారంతో ఈ వేదిక ద్వారా సమస్యల పరిష్కారానికి



మరింత వేగవంతమైన మార్గం సుసాధ్యం అవుతుందన్న నమ్మకంతో ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగించాలని నాయకులు తెలియజేశారు.

# దాతలు పేద విద్యార్థులను దత్తత తీసుకోవాలి
## -తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపు

తణుకు, మే 30 ( ప్రభాత వార్త): ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ చదువుకోలేని స్థితిలో ఉన్న పేద విద్యార్థులను దాతలు దత్తత తీసుకుని వారి ఉన్నతికి తోడ్పడాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం తణుకులో నూతనంగా నిర్మించిన కిరాణా వర్తక సంఘం భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉన్నత స్థానంలో సమాజంలో కొనసాగుతున్న వారు పేదలకు ఆర్థికంగా చేదోడు వాదోడుగా నిలబడాలని ఉద్దేశంతో ప్రభుత్వం పి 4 విధానాన్ని అమలు చేస్తుందని చెప్పారు. కిరాణా వర్తక సంఘం సభ్యులు ఐక్యంగా ఉంటూ నిధులు సమకూర్చుకొని ఒక భవనాన్ని నిర్మించుకోవడం అభినందనీయమని అన్నారు ఇదే రీతిగా సభ్యులు పేద విద్యార్థులను దత్తత తీసుకోవాలని కోరారు. సంఘ భవనం ద్వారా వచ్చే ఆదాయాన్ని సభ్యుల ఆర్థిక అభివృద్ధికి ఖర్చు చేసే విధంగా ప్రణాళికలు చేసుకోవడం



అభినందనీయమని అన్నారు. చిన్న స్థాయిలో వ్యాపారాలు, వ్యాపారస్తుల ఆర్థిక అభివృద్ధికి సంఘం కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా వ్యాపారులు సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ ను నిషేధించి తణుకులో ప్లాస్టిక్ నిషేధానికి సంపూర్ణ సహకారం అందించాలని ఎమ్మెల్యే రాధాకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు రెడ్డి వీరన్న, కార్యదర్శి కోర్లేపర సత్యనారాయణ, కోశాధికారి శంకర్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# 18 నెలల పాపకు ఆర్థిక సహాయం

భీమవరం మే 30 ప్రభాతవార్త :ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరంలోని అల్లూరి శ్రీరామరాజు కళ్యాణ మండలంలో 18 నెలల పాపకు బ్రెయిన్ ఆపరేషన్ నిమిత్తం దాతల సహకారంతో రూ 20 వేలు ఎమ్మెల్యే అంజిబాబు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పులపర్తి ప్రశాంత్ చేతుల మీదుగా అందించారు. పట్టణానికి చెందిన రఫీ, ఆఫీయ దంపతుల 18 నెలల హప్సా అనే పాప అనారోగ్యం (బ్రెయిన్ కు సంబంధించి) తో బాధపడుతుంది. దాత భీమవరపు పెద్దిరాజు పాప ఆపరేషన్ నిమిత్తం రూ 20 వేలు సహకారం అందించడం



గొప్ప విశేషమని ఎమ్మెల్యే అంజిబాబు దాతను అభినందించారు. కార్యక్రమంలో ఎగ్జిబిషన్ అలీషా, చల్లా రాము తదితరులు పాల్గొన్నారు.

# వెండితెరపై కృష్ణ పేరు చేరగని ముద్ర
## - క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ కనకరాజు సూరి

భీమవరం మే 30 ప్రభాతవార్త: సూపర్ స్టార్ కృష్ణ ఓ హీరోగానే కాదు వ్యక్తిగతంగా మంచి మనుసున్న చాటుకున్న నటులని క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వేగేశ్న కనకరాజు సూరి అన్నారు. శుక్రవారం భీమవరం ప్రభుత్వాస్పత్రి రోడ్డులో పద్మభూషణ్ సూపర్ స్టార్ డా ఘట్టమనేని కృష్ణ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కనకరాజు సూరి మాట్లాడుతూ వెండితెరపై సూపర్ స్టార్ కృష్ణ పేరు చేరగని ముద్ర అని, సువర్ణాక్షరాలతో అభిమానుల గుండెల్లో నిలిచిపోయిన నటులని, సాహసాలకు, సంచనాలకు కృష్ణ కేరాఫ్ అడ్రస్ గా నిలిచారని అన్నారు. చైతన్య భారతి నాటక పరిషత్ అధ్యక్షులు రాయప్రోలు భగవాన్, సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ కృష్ణ తెలుగు చలన చిత్ర పరిశ్రమ ఖ్యాతిని పెంచిన ఆయన కథ తెలుగు వెండితెరపై ఓ చరిత్రగా నిలిచిందన్నారు. అభిమానుల మనసుల్లో ఎప్పటికీ ఆయన సూపర్ స్టార్ అని అన్నారు. కృష్ణ ఫ్యాన్స్ అసోసియషన్ గౌరవాధ్యక్షులు రాయప్రోలు శ్రీనివాస్ మూర్తి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలపాటు కృష్ణతో అనుబంధం ఉందని, ప్రతి అభిమాని గుండెల్లో ఆయన చిరస్థాయిగా ఉంటారని, ఆయన



పేరిట ఎప్పుడు కూడా సేవా కార్యక్రమాలను చేపడతామని అన్నారు. అనంతరం పేదలకు భోజనం, గొడుగులనుఅందించారు. కార్యక్రమంలో కృష్ణ మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు సుబ్బరాజు, పేరిచర్ల లక్ష్మణ వర్మ, పెన్నాడ శ్రీను, కాట్రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సింగల్యూస్ ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా.

అత్తిలి - మే 30 ( ప్రభాత వార్త ): గ్రామంలో సింగల్యూస్ ప్లాస్టిక్ కవర్లను వినియోగించే వర్తకులపై 2 వేల 5 వందల వరకు జరిమానా విధిస్తామని అత్తిలి పంచాయతీ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. వ్యాపారస్తులు తమ ప్రకటన బోర్డు లను రోడ్డులపై పెడితే పంచాయతీ వారు తొలగిస్తారని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని కోరారు. జూన్ నెలకు సంబంధించిన పింఛన్లు మే 31 న పంపిణి చేయనున్నట్లు తెలిపారు.

# మల్లిపూడిలో వికసి వికసిత కృషి సంకల్ప అభయాన్ కార్యక్రమం

పెనుమంట్ర, మే-30, ప్రభాతవార్త: మండలంలోని మల్లిపూడి గ్రామంలో సాయి శాఖ ఆధ్వర్యంలో వికసి వికసిత కృషి సంకల్ప అభయాన్ కార్యక్రమం ఉండి కృషి విజ్ఞాన కేంద్రం, మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం శుక్రవారం సంయుక్త నిర్వహించాయి. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డా. మల్లికార్జునరావు మాట్లాడుతూ మన డెల్టా ప్రాంతంలో ఖరీఫ్ సీజన్ లో వరి ప్రధాన పంట కాబట్టి, వరిలో వచ్చే పురుగులు తెగుళ్ల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అలాగే ఎరువుల యాజమాన్యం, కలుపు మందుల యాజమాన్యం, గురించి రైతులకు విసిదీకరించడం జరిగింది. రబి పంట కోసిన వెంటనే రైతులు ముఖ్యంగా వరిగడ్డిని తగలబెడుతున్నారు అది మంచి పద్ధతి కాదని ఈ రకంగా వరిగడ్డిని తగలబెడితే పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయని అన్నారు. భూమిలో కార్బన్ శాతం పెరుగుతుందని దీని ద్వారా మొక్కలకు అందుబాటులో ఉండాల్సిన పోషకాలు అందవని తెలిపారు. డా. పి వినయ లక్ష్మి మాట్లాడుతూ ముంపుకు తట్టుకునే వారి రకాల గురించి మన డెల్టా ప్రాంతంలో సాగుకు అనుకూలమైనటువంటి రకాల గురించి తెలియజేశారు. రైతులు గోస్తనినది మురుగు వలన




పంటలు మునిగి దెబ్బతింటున్నాయని దానికి అనుగుణంగా పరిశోధనా స్థానం వారు వరి రకాలను కొత్త వాటిని రైతులకు అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెదవేగి ఆయిల్ ఫామ్ పరిశోధన స్థానం నుండి డా. కే మనోరమ, ఉండి కె వి కె శాస్త్రవేత్త డా. బిందు ప్రవీణ, మార్టేరు పరిశోధన స్థానం నుండి డా. బి సహదేవరావు, ఆనంద్ కుమార్, వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వెలగల బుల్లి రామిరెడ్డి, గ్రామ సర్పంచ్ దొంగ మహాలక్ష్మి, కూటమి నాయకులు సుందర్ రామిరెడ్డి, కాసాని విజయప్రసాద్, సోమేశ్వరరావు, కర్రి బ్రహ్మానంద రెడ్డి మరియు వ్యవసాయ అధికారిని ఏ జోషిలా తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ దుకాణాల వద్దే నిత్యం అవసరాలు పంపిణీ,
## పెనుమంట్ర తహసిల్దార్ యడ్ల రవికుమార్

పెనుమంట్ర, మే-30, ప్రభాతవార్త: వచ్చేనెల జూన్-01వ తేదీ నుండి 15వ తేదీ వరకు బియ్యం ఇతర నిత్యవసర వస్తువులన్ని చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేయబడునని పెనుమంట్ర తహసిల్దార్ యడ్ల రవికుమార్ తెలిపారు. శుక్రవారం అయినా శుక్రవారం ఆయన రేషన్ దుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌక దుకాణాలు ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు, సాయంత్రం 04 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉండాలని అన్నారు. ఒకటో తేదీ ప్రజా ప్రతినిధుల చేత ఈ కార్యక్రమం ప్రారంభించబడుతుందన్నారు. నిత్యవసర వస్తువులు



పంపిణీలో డీలర్లు పారదర్శకంగా, జవాబుదారిగా ఉండాలన్నారు. బియ్యం ఉచితంగాను, అంత్యోదయ కార్డులకు కిలో రూ.13.50, మిగిలిన కార్డులకు అరకిలో రూ.17.00 చొప్పున చొప్పున పంపిణీ చేయబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని కార్డుదారుల సద్వినియోగం చేసుకోవాలన్నారు.

